# భారతీయాంగ్ల కవులు

డా.శ్యామల కల్లూరి



2

## చారిత్రక నేపథ్యం

**భారతదేశం** రాజకీయంగా ఈస్ట్ ఇండియా కంపెనీ చేతుల్లోనుంచి బ్రిటీషు కిరీటపు అధికారం క్రిందకి మారేనాటికి మనదేశం అప్పటికే దాదాపు ఏడెనిమిది వందల సంవత్సరాలపాటు ఏదో ఒక విదేశపు బానిసత్వపు సంకెళ్ళల్లో అణగిమణగి వుండిందనేది మనందరికీ తెలిసిన విషయమే! దాదాపు 1205 ఎ.డి నాటితో ప్రారంభమైన పరాయిపాలన చేతులుమారుతూ 1947 ఆగస్ట్ 15లో దేశం సర్వ స్వతంత్రదేశం అయిందాకా కొనసాగింది. అయితే మొగలాయి రాజ్యపాలనలో పాలకులు దాదాపు అక్బరుకాలంనుంచీ ప్రవేశపెట్టిన పరిపాలనా పద్ధతులు, వాటివలన దేశానికి జరిగిన ఉపకారాలు బేరీజు వేస్తే మొగలాయి సంస్కృతి పూర్తిగా భారతీయ సంస్కృతిలో విలీనమయిందని స్పష్టమవుతుంది. ఎంతబాగా మొగలాయీ రాజులు భారతీయ సంస్కృతిలో మమేకమైనారంటే 1857లో జరిగిన మొదటి స్వాతంత్ర యుద్ధంగా చిత్రీకరింపబడిన సిపాయి తిరుగుబాటు ఉద్యమాలన్నిటికీ భారతీయ సిపాయిలు, ఆఖరి మొగలాయి రాజు బహదూర్ షా జఫర్ని భారతీయ రాజుగా, బ్రిటీషు వారికి విరుద్ధంగా తమని నడిపింపగలిగిన దేశ ప్రతినిధిగా, పరిగణించారు. ఈ విలీనం మొగలాయిరాజు అక్బరుతో మొదలయిందని చెప్పవచ్చును.

చారిత్రక ఋజువులు వున్నాయిని చెప్పలేకపోయినా జనంలో ప్రచారంలో వున్న కథలని పరిశీలిస్తే అక్బరు జననం ఒక హిందూ రాజపుత్ర ప్రముఖుని ఇంట్లో జరిగిందనీ, అతనికి రాజపుత్రులతో చాల సన్నిహిత సంత్సంబంధాలు వుండేవనీ అర్థమవుతుంది. ఈరోజు ఏ ఇంటర్నెట్ సైట్‌లోకి వెళ్ళినా అక్బరు జననం గురించీ అతనికి రాజపుత్రులతో గల సంబంధాల గురించి ఎన్ని కథలు ప్రచారంలో వున్నాయో అర్థమవుతుంది. ముఖ్యంగా హిందీలో ఇటీవల విడుదల అయిన జోధా-అక్బరు ఎన్నో వాద వివాదాలకి దారి తీసింది. వీటన్నిటి వెనకాల చారిత్రక సత్యాన్ని తెలుసుకోవాలన్న నిజాయితీ కన్నా హిందూ-ముస్లిం వివాహాల రాజకీయాలని ఖండించి, హిందూ ధర్మానికి అన్యాయం జరుగుతుందనీ, వాళ్ళు భావించే అన్యాయాన్ని అరికట్టాలనే నేటి రాజకీయాల ఛాయలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే వాటి చారిత్రక సత్యాల జోలికి ఇక్కడ పోదలుచుకోలేదు. మన చరిత్రకి సంబంధించినంత మట్టుకు మొగలాయీ సుల్తానులు భారతీయ రాజులుగా గుర్తింపబడినారనేదే ముఖ్యం! అయితే ఔరంగజేబు కాలం వచ్చేనాటికి చాలా మట్టుకు భారత దేశం మొగలాయి పాలన క్రిందకి వచ్చినా మత కలహాలు పెచ్చు పెరిగాయి. అలా మొగలాయి సామ్రాజ్యం క్రమేణా క్షీణించి పోయింది.

బహదూర్ షా జఫర్ గొప్ప సాహితీ ప్రియుడనీ, స్వయంగా కవి అనీ పేరు పొందినా రాజకీయంగా అతి బలహీనుడైన రాజు. అతనితో మొగలాయి సామ్రాజ్యం అంతరించింది. బ్రిటీషు ప్రభుత్వం అసహాయుడూ, అసమర్థుడూ అయిన ఈ రాజుని అప్పటి బర్మా దేశంలో భాగమైన రంగూన్‌కి బహిష్కరించింది. సమకాలీన సాహిత్యంలోను తర్వాత వచ్చిన చారిత్రక కథనాలలోను ఈయన మృతిని గురించి హృదయవిదారకమైన కథలు ప్రచారంలో వున్నాయి.

అలా మొదలయిన బ్రిటీషు రాజకీయ అధికారిక పాలన, ఈస్ట్ ఇండియా పరిపాలన అంతమై విక్టోరియారాణి అధీనంలోకి భారతదేశం ఒక సామ్రాజ్య దేశంగా మారటంతో ఒక మలుపు తిరిగింది. నవంబరు ఒకటవ తారీఖు 1858 లో విక్టోరియా రాణి ఇచ్చిన ప్రకటనతో యిది అమలులోకి వచ్చింది.

మొదటితరం బ్రిటీషు పాలకులు జాతి దురహంకారానికీ అధికార మధాంధకారానికీ ప్రతీకలు. కాలక్రమేణా ఈ దేశంలో వుండి దీన్ని పాలించాలంటే వాళ్ళు ఈదేశ భాషలనన్నా నేర్చుకోవాలి ఈ దేశవాసులకి ఆంగ్లభాషనన్నా నేర్పించాలి అనే అవసరాన్ని గుర్తించారు. వివిధ భాషా సంస్కృతుల సమేళనమైన భారతదేశం వారికి ఒక సవాలుగా నిలిచింది. కొందరు ఆంగ్లేయులు భారతీయ సంస్కృతి పట్ల, భాషల పట్ల ఆకర్షితులై ఈ దేశపు వందల సంవత్సరాల సంస్కృతిని తెలుసుకోవటానికి సంస్కృతభాషని అభ్యసిస్తే మరికొందరు కలకత్తాలో, మద్రాసులో ఢిల్లీ హైదరాబాదులలో ఆయా ప్రాంతపు భాషలు నేర్చుకున్నారు. తెలుగుభాషని అధ్యయనం చేసి అందులోని వేమన పద్యాలవంటి అమూల్యరత్నాల్ని వెలికితీసిన ఘనత, మొదటి తెలుగు-ఆంగ్ల పదకోశాన్ని కూర్చిన ఘనత సాధించిన సి.పి. బ్రౌనుదొరని ఈ సందర్భంగా తలుచుకోవటం సముచితం. మరికొందరు దేశవాసులు, ఆంగ్ల విద్యామాధ్యమం ద్వారా, భాషా సాహిత్యాలని ఔపోసనం పట్టడం మొదలుపెట్టారు. ఈ రకమైన సంస్కృతీ వారధులు, ఒక అందమైన మలుపుకి దారి తీసి భారతీయాంగ్లసాహిత్యానికి పునాదులు పడ్డాయి. విలియం జోన్స్, డేవిడ్ హారే వంటి ప్రముఖులు భారతీయ సంస్కృతినీ, సమాజాన్నీ, ద్యాత్మకపునాదుల్నీ అర్థంచేసుకుని విస్తారంగా రాశారు.

అలాగే ఆంగ్ల విద్యాబోధన మొదలైనాకా వచ్చిన మొదటితరం భారతీయులు సాహిత్యాన్ని, హేతువాద దృక్పధాన్ని విజ్ఞాన పరంపరలనీ ప్రేమించటంతో పాటు, స్వదేశీ సమాజంలో వున్న వెనుకబడిన తనాన్ని కులతత్వాల్ని, మూఢనమ్మకాల్నీ, సాంఘికదురాచారాల్నీ వదిలించుకోవల్సిన ఆవశ్యకతని గుర్తించారు. రాజారామ మోహన్ రాయ్, కేశవచంద్ర సేన్, దేవేంద్రనాథ్ టాగూర్ వంటి సంస్కర్తలు, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, హెన్రీ డెరోజియో వంటి స్వదేశీయులెందరో ఈ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారణభూతులైనారు. కలకత్తాలో, మద్రాసులో, బొంబాయి నగరాలలో విద్యాసంస్థలు వెలిసాయి. మెకాలే మినిట్స్ ఆంగ్ల విద్యాబోధనకి పునాదులు వేస్తే, విలియం బెంటిక్‌లాంటి పరిపాలనదక్షులు 'సతి' వంటి సాంఘికదురాచారాలకి చట్టపరంగా స్వస్తి పలికారు.

ఈరకంగా ఒక సాంస్కృతిక పునరుజ్జీవనం ఆధారంగా భారతీయాంగ్ల సాహిత్యం వేళ్ళుపాదుకుంది. తొలితరం కవులు రచయితలలో ఆంగ్ల సాహిత్యాన్ని గుడ్డిగా అభిమానించి, అనుకరించిన వాళ్ళూ వున్నారు. భారతీయ సంస్కృతియొక్క గొప్పదనాన్ని - ఆంగ్లేయులకి, స్వంత సంస్కృతిని గురించి తెలియని భారతీయులకి చెప్పాలనే తపనతో రామాయణ, మహాభారతాలు, ఉపనిషత్తులని గురించి ఆంగ్లంలో రచించిన వాళ్ళూ వున్నారు. సాహిత్యం, ఆలోచనాధోరణి ఇచ్చిన పటిమతో స్వంత భాషలని పునరుద్ధరించి సాహిత్య సృష్టికి అనుగుణంగా భాషని తీర్చిదిద్దిన మైకేల్ మధుసూదన్ దత్‌లాంటి విద్వాంసులున్నారు. దాదాపు అన్ని భారతీయ

భాషలలోను ఆంగ్లభాషను అభ్యసించిన అర్థం చేసుకున్న పండితులూ, ఆంగ్ల భాష వాసనలేమాత్రం లేని స్వదేశీ పండితులు సాహిత్య ప్రక్రియలని పునరుద్దరించారు.

నాటి నుండి నేటి వరకు ఆంగ్లభాష వలన దేశానికి మేలు కలిగిందా, కీడు జరిగిందా అనే వాదవివాదాలు ప్రచారంలో వున్నాయి. నేడు భారతదేశంలో మాతృభాషల ప్రాముఖ్యం తగ్గిపోయిందనేది నిర్వివాదశం. ఆంగ్లం అప్పటికీ ఇప్పటికీ కూడా ఈ రకమైన ద్వైదీ భావనని సృష్టిస్తూనే వుంది. దేశం ఆర్థికంగా విద్యాపరంగా ముందుండడానికి నేడు ఆంగ్లభాషతో మన యువతకున్న ప్రావీణ్యమే కారణమనేది కూడా అనేది కూడా నిర్వివాదాంశమే! మాతృభాషలకి తల్లికిచ్చిన గౌరవాన్నిచ్చి సజీవంగా నిలబెట్టడం గూడా మన బాధ్యత. ఆంగ్లభాష నేర్చుకోవాలంటే మనభాషని వెనక్కుపెట్టాలనే అనే వాదనే ఒక విధంగా లోపభూయిష్టమైనది. భారతదేశంలో నగర సమాజాలలో ప్రతి వ్యక్తీ సహజంగానే ద్విభాషాప్రావీణ్యంతో వుంటారు. పాతరోజుల్లో సంస్కృతం ఎలా జ్ఞాన సముపార్జనకి అత్యవసరమైందో ఈనాడు – ఆంగ్లం అవసరార్థం మనకి ఉపయోగపడుతున్న భాష . ఒక చారిత్రక ఆవశ్యతగా మనకి సంక్రమించిన భాష . నేడు దేశ విదేశాల్లో మన రచయితలు, కవులు అవార్డులతో సత్కరింపబడే దాకా ఎదగటానికి నాడు చారిత్రకంగా ఏర్పడిన పునాదులు ముఖ్యకారణాలు.

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

✡✡✡